విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు జాతీయ రహదారి పక్కన తాడేపల్లిగూడెం వైపు వెళ్లే బస్టాండ్ వద్ద ఆదివారం మజ్జిగ చలివేంద్రాన్ని ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ పత్స మట్ల ధర్మరాజు ప్రారంభించారు. జనసేన నాయకులు సూరత్తుల అయ్యప్ప ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రంను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన నాయకులు,వీర మహిళలు, గ్రామ జనసైనికులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నా వారిని జనసేన నేత నాయకుడు ధర్మరాజు అభినందించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెరగాలి

విశాలాంధ్ర తాడేపల్లిగూడెం రూరల్ : అన్ని సబ్జెక్టుల్లో నైపుణ్యాభివృద్ధిని సాధించి పాఠశాల స్థాయి నుంచే ఎంచుకున్న రంగంలో సృజనాత్మకత పెంపొందించుకోవాలని తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ఛైర్మన్ చింతపట్ల వెంకటాచారి అన్నారు. ఆదివారం పెదతాడేపల్లిలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థులు సాధించిన 150 తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ప్రాజెక్టును పరిశీలించారు. విద్యార్థులు కనపరచిన ప్రతిభను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పాఠ్యాంశంలోని పాఠాలను ప్రాజెక్టుల రూపంలో తయారు చేసి తోటి విద్యార్థులకు స్పష్టంగా వివరించడం ద్వారా పాఠ్యాంశంలోని సారాంశం ఆ విద్యార్థి పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉంటారని తెలిపారు. ప్రాజెక్ట్ లు తయారు చేయడం ద్వారా విద్యార్థుల్లోని ప్రతిభ, సాంకేతిక పరిజ్ఞానం బయటపడుతుందన్నారు.కృషి పట్టుదలతో ఎంచుకున్న రంగంలో విజయం సాధించేవరకు నిరంతరం కష్టపడాలన్నారు. పాఠశాల స్థాయిలో చేస్తున్న ప్రాజెక్టు విద్యా వ్యవస్థలో పెనుమార్పులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి. రాజారావు, వైస్ ప్రిన్సిపాల్ బి.ప్రతాప్, ఉ పాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర -ముసునూరు: ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలోనికి 2023-24వ విద్యా సంవత్సరం ప్రవేశం పొందేందుకుగాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ యార్లగడ్డ శ్రీదేవి అన్నారు. ఆమె మాట్లాడుతూ ఏపి గురుకుల విద్యాలయాల సంస్థ గుంటూరు వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ముసునూరు,నిమ్మకూరు,పులిగడ్డ పాఠశాల్లో 5వ తరగతి ప్రవేశానికి ఇంగ్లీషు మీడియంలో చదువుకునేందుకుగాను ప్రస్తుతం 4వతరగతి పూర్తిచేసిన విద్యార్థిని,విద్యార్థులు మీ సేవా కేంద్రాల్లో ,ఇంటర్నెట్ కేంద్రాలలో ఈ రోజు నుండి ఈనెల 24వ తేది లోపల దరఖాస్తు చేయవచ్చునన్నారు.బాలికలకు నిమ్మకూరు, ముసునూరు కాగా,బాలురకు పులిగడ్డ,నిమ్మకూరు పాఠశాలలో సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. వివరాల కోసం 9866559629 ఫోన్ నెంబరును సంప్రదించవచ్చునన్నారు.అలాగే 6,7,8వ తరగతుల వారికి నిమ్మకూరు,పులిగడ్డ పాఠశాలలో బ్లాక్‌లాగ్ సీట్లు వున్నాయాని ఆవకాశం వున్నవారు ఆప్లే చేసుకోవచ్చునన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర- ముసునూరు: ముసునూరు మండలం చెక్కపల్లిగ్రామం దళితవాడలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు చెక్కపల్లి గ్రామానికి చెందిన కొయ్యూరి రవికుమార్, కొయ్యూరి బసవపూర్ణ అను ఈ ఇద్దరు మానసిక అంగవైకల్యం కల్గిన అక్కతమ్ముడు వీరు నివాసం వుంటున్న రెండు తాటాకు ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధంకావడంతో కన్నీరు మున్నీరవుతున్న భాదితులు. పారిశ్రామిక వేత,టిడిపి నాయకులు పర్వతనేని గంగధరరావు వీరు కుటంబ సభ్యలకు తమ వంతు సహాయంగా రూ.పదివేలు ఆర్థిక సహాయం అందచేశారు. అక్కినేని చందు,తోట ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణ వేడుకలో జనసేన ధర్మరాజు

విశాలాంధ్ర - నిడమర్రు: నిడమర్రు మండలం పెదనింద్రకొలను గ్రామానికి చెందిన వంగా ప్రసాద్ ద్వితీయ కుమార్తె నాగ వెంకట ఈశ్వరి ప్రియ పుష్పాలంకరణ వేడుకలలో ఆదివారం పాల్గొని ఆశీర్వదించిన ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్ చార్జ్ పత్సమట్ల ధర్మరాజు ఆయనతో పాటు జనసేన నాయకులు, వంగా రఘు, వాసురాజు కందులపాటి సత్యనారాయణ,గ్రామ జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీగంధం చెట్ల పెంపకదార్ల సమస్యలు తీర్చాలి

విశాలాంధ్ర - లింగపాలెం : శ్రీగంధం(చందనం), ఎర్ర చందనం చెట్ల పెంపకదార్ల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఈ చెట్ల పెంపకదార్ల అసోసియేషన్ సభ్యులు కోరారు. సంఘ సమావేశం ఆదివారం ధర్మాజీగూడెంలో జరిగింది. సంఘ అధ్యక్షులు గారపాటి పూర్ణచంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చెట్ల పెంపకపుదార్ల సమస్యలపై చర్చించి అనేక డిమాండ్లను తీర్మానించారు. ఈ డిమాండ్ల పరిష్కారం కోసం ప్రధాని నరేంద్ర మోదీకి మెమోరాండం ఇవ్వాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం శాండ్ ఉడ్ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. రైతులు పెంచుతున్న శ్రీగంధం, ఎర్ర చందనం చెట్లకు ప్రత్యేక చట్టం తేవాలన్నారు. ఈ చెట్లను మార్కెట్‌లో రైతులు అనుగుణంగా విక్రయించే వెసులుబాటును కల్పించాలని, ఈ చెట్ల ద్వారా ఆదాయం వచ్చేలా ప్రభుత్వం పరిశ్రమలను నెలకొల్పాలని కోరారు. సుగంధ ద్రవ్యాల చెట్ల నుంచి మెడిసన్ తయారు చేస్తున్నారని, వీటిపై మరింతగా విశ్లేషణ చేసి రైతులకు, ప్రభుత్వానికి ఆదాయం వచ్చే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ చెట్ల వల్ల పొల్యూషన్ తగ్గి ప్రాణవాయువు పెరుగుతుందని, దీనిని పరిశీలించి కార్బన్ క్రెడిట్ ట్రేడింగ్ ద్వారా ఆదాయ వనరులను కల్పించటం వల్ల మానవాళికి మంచి జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ విషయం ప్రధాన మంత్రికి నివేదించాలని సమావేశంలో తీర్మానించారు. ఇటీవల రాష్ట్ర పరిధిలో శ్రీగంధం చెట్ల దొంగతనాలు 40 జరిగాయని, ఇంకా జరుగుతున్నాయని, జరిగిన ప్రతీ దొంగతనంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయించే చర్యలు తీసుకోవాలని, దొంగతనాలు అరికట్టే చర్యలు కోసం డీజీపీని కోరాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో గారపాటి పూర్ణచంద్రరావుతో పాటు సంఘ ఉపాధ్యక్షులు గోగినేని కృష్ణారావు, కార్యదర్శి తుమ్మల మురళీకృష్ణ, సంఘ సభ్యులు ఈద్పుగంటి వెంకట సుబ్బారావు, కె.నరసింహారావు పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి శ్రీగంధం, ఎర్ర చందనం చెట్ల పెంపకపుదార్లు సమావేశానికి వచ్చేశారు.

సీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

విశాలాంధ్ర జంగారెడ్డిగూడెం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడిన యోధుడు చంద్ర రాజేశ్వరరావును సిపిఐ శ్రేణులు, ప్రజా సంఘాలు స్ఫూర్తిగా తీసుకోవాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. సిపిఐ పూర్వ ప్రధాన కార్యదర్శి, అగ్రనేత చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతి ఆదివారం స్థానిక సిపిఐ పట్టణ కార్యాలయంలో సిపిఐ మండల కార్యదర్శి జే వి రమణ రాజు అధ్యక్షతన జరిగింది. చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి కృష్ణ చైతన్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు భూస్వామ్య కుటుంబంలో జన్మించి తన యావదాస్తిని పార్టీ కోసం త్యాగం చేశారని కొనియాడారు. అటవీ బంజరు భూములను ఆక్రమించి పేదలకు పంచిపెట్టి పోరాట యోధుడిగా నిలిచారాన్నారు.చల్లపల్లి జమీందారీ పోరాటం, తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన చూపిన తెగువ నేటి యువతరం ఆదర్శంగా తీసుకుని అనుసరించాలని కోరారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు దృక్పథంతో సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలను, ముందుకు తీసుకెళ్లినందుకు రాజేశ్వరరావును ఆర్డర్ ఆఫ్ లెనిన్ అవార్డుతో సోవిట్ యూనియన్ సత్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు గొలిమే బాల యేసు, తాళ్లూరి నాగరాజు, జగన్నాథ్, లక్ష్మణ్, రాజుల శ్రీను, పాయం శ్రీను, హను మంతు, గురు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర తణుకు: ప్రజా ఉద్యమాల కోసం కృషి చేస్తూ నిరంతరం పోరాటల యోధుడు చంద్ర రాజేశ్వరరావు అని ఆయన ఆశయాలను అనుసరించాలని సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు అన్నారు. చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక హౌసింగ్‌బోర్డు పార్క్ నందు గల చంద్ర రాజేశ్వర రావు విగ్రహానికి సీపీఐ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అభివృద్ధికోసం నిరం తరం పోరాడిన మహోన్నత వ్యక్తి అని కొని యాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బండి సత్యనారాయణ, నామన వెంకటేశ్వరరావు, నూనె రాధాకృష్ణ పాల్గొన్నారు.

విశాలాంధ్ర -భీమవరం: పోరాట యోధుడు, త్యాగశీలి సీపీఐ నిర్మాత కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు స్ఫూర్తితో పీడిత తాడిత ప్రజానీకం కోసం అలుపెరుగని ఉద్యమాలు నిర్మించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు పిలుపునిచ్చారు. ఆదివారం చంద్ర రాజేశ్వరరావు వర్ధంతిని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించి ఘన నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో జన్మించిన చంద్ర తాడిత పీడిత ప్రజల కోసం తన యావదాస్తిని ధారపోశారని కొనియాడారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కిలారి మల్లేశ్వరరావు, సిపిఐ నాయకులు ఆకల రాము, పాలా త్రిమూర్తులు, ఆదినారాయణ, బంగారు శివ, నీలాపు శ్రీను, సత్యనారాయణ పాల్గొన్నారు.

విశాలాంధ్ర- కామవరపుకోట : భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నేత పార్టీ పూర్వ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి ఆదివారం కామవరపు కోటలో నిర్వహించారు. చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి సిపిఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నీలం శ్రీనివాస్, టి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి దొమ్మేటి కృషి

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర పాలకొల్లు: సీపీఐ సీనియర్ నాయకులు దొమ్మేటి విశ్వనాథం సంస్మరణ సభ ఆదివారం అరట్లకట్ట గ్రామంలో విశ్వనాథం నివాసమందు జరిగింది. సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దొమ్మేటి విశ్వనాథం సీపీఐ పార్టీ పట్ల అచంచలమైన విశ్వాసం నమ్మకంతో పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. పార్టీ పట్ల నిబద్ధతతో ప్రజాసమస్యల పరిష్కారానికి పార్టీ నిర్వహించిన అనేక ఉద్యమ పోరాటాల్లో తనవంతు పాత్ర నిర్వహించారన్నారు. యువజన సమాఖ్య, వ్యవసాయ కార్మిక సంఘంలో పనిచేశారన్నారు. గ్రామ ఉపసర్పంచ్‌గా పనిచేసిన విశ్వనాథం పేద వర్గాల ఉన్నతికి ఎంతగానో శ్రమించి గ్రామ ప్రజల మన్ననలు పొందారన్నారు. విశ్వనాథం మృతి పార్టీకి తీర్చలేనిదని కొనియాడారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు నెక్కంటి సుబ్బారావు సంస్మరణ సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ సీపీఐ పార్టీ నాయకునిగా నిరంతరం ప్రజల సమస్యలు పరిష్కరానికి దొమ్మేటి విశ్వనాథం ఎంతగానో కృషి చేశారన్నారు. గ్రామంలో రాజకీయాలకతీతంగా అన్ని వర్గాలను కలుపుకుని గ్రామాభివృద్ధిలో ప్రముఖ పాత్ర నిర్వహించారన్నారు. గ్రామ సర్పంచ్ వాసురాజు, మాజీ సర్పంచ్ కైలా నరశింహారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్,మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నెక్కంటి జగదాంబ, సీపీఐ నరసాపురం ఏరియా కార్యదర్శి నెక్కంటి క్రాంతికుమార్,సీపీఐ జిల్లా సమితి సభ్యులుఆరేటి మృత్యుంజయరావు, ఎం.లక్ష్మీపతి,ఆళ్ళ సత్యనారా యణ, బి.సి.సంఘ నాయకుడు కడలి మృత్యుంజయుడు మాట్లాడుతూ దొమ్మేటి విశ్వనాథం మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటుగా పేర్కొంటూ నివాళులర్పించారు.

ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్న మోదీ

విశాలాంధ్ర - బుట్టాయగూడెం: దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, ఆర్ఎస్ఎస్,సంఘ్ పరివార సూచనలతో ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ విధ్వంసకర పాలన కొనసాగిస్తున్నారని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ఆదివారం మండలంలోని కంద్రిక గూడెంలో సిపిఐ మండల కార్యదర్శి సోదెం వెంకటేశ్వరరావు అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న కృష్ణ చైతన్య సిపిఐ ప్రజా సమస్యలపై పోరాడుతుంటే ప్రధాని మోడీ దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు దారా దత్తం చేస్తూ కార్పొరేట్ వాదులను కాపాడుతున్నాడని విమర్శించారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ లౌకిక వ్యవస్థను విచ్ఛిన్నం చేసి హిందుత్వ దేశంగా మార్చాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. భారతదేశం విభిన్న జాతులు, సంస్కృతులు, భాషలు గల దేశం లో వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. దేశ సహజ సంపదను తన అనుంగు దత్తపుత్రులైన అదాని అంబానీ చేతుల్లో పెడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో జగన్ ప్రజా వ్యతిరేక విధానాలతో అభివృద్ధిని తుంగలో తొక్కాడని ఆయన విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా విశాఖలో 700 రోజులు పైబడి పోరాటం చేస్తుంటే జగన్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.రాష్ట్రంలో ప్రశ్నించే విపక్షాలపై దాడులు చేయించడం పరిపాటిగా మారిందన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 14 నుండి 30 వరకు సిపిఐ, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో జరిగే ప్రచార భేరియాత్రను జయప్రదం చేయాలని, 12న జంగారెడ్డిగూడెంలో సిపిఐ, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో జరిగే పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఎస్ జిల్లా కార్యదర్శి కారం దారయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాడిశ రాము, జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జేవి. రమణ రాజు, బుట్టాయగూడెం మండల సహాయ కార్యదర్శి ఉయ్యకే చంద్రం పాల్గొన్నారు.

గోతులు పూడ్చిన సోషల్ వర్కర్స్ టీమ్

విశాలాంధ్ర,జంగారెడ్డి గూడెం: ప్రజలకు మేలు చేసే కార్య క్రమాలు చేస్తూ గుర్తింపు పొందిన కామవరపు కోట సోషల్ వర్కర్స్ బృందం ఎర్రకాలువ వంతెనపై గోతులు పూడ్చి సామాజిక బాధ్యత నెరవేర్చారు. ఏలూరు-జంగారెడ్డి గూడెం మార్గంలో మద్ది అంజనేయ స్వామి ఆలయం సమీపంలోని ఎర్ర కాలువపై ఉన్న వంతెన ట్రాఫిక్ కారణంగా దెబ్బతింది. ఓపక్క సుమారు రెండు మీటర్ల మేర పూసలు లేచి ప్రమాద కరంగా మారింది.ఈ పరిస్థితిని పత్రికల్లో సోషల్ మీడియాలో చూసిన కామవరపు కోట కుచెందిన సోషల్ వర్కర్స్ టీమ్ ఆది వారం దెబ్బతిన్న రోడ్డును సిమెంట్‌తో పూడ్చారు. ఈ సందర్భంగా బృందం లోని పందూరి రామసాయి,వీరమళ్ల సౌజన్ సాయి మాట్లాడుతూ నిత్యంఅధికారులు ప్రజా ప్రతినిధులు జిల్లా కేంద్రం ఏలూరుకు రాక పోకలు సాగిస్తుంటారని బ్రిడ్జి దెబ్బతిందని తెలిసి కూడా ఎవరూ స్పందించ లేదన్నారు.సుమారు ఏడాది గా ఆగోతులు రోజు రోజుకు పెద్దవి అవుతున్నాయనిపూసలు గుచ్చు కునిపలు ప్రమాదాలు జరిగాయని తెలిపారు.అలాగే వదిలితే వంతెన పునాది దెబ్బ తింటుందని సుమారు రూ.3వేలు ఖర్చు తో మరమ్మతులు చేసామని తెలిపారు.ఇది తమ బాధ్యతఅని చేసాం అని వారు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు వారిని అభినందించారు.

14 నుండి 30 వరకు ప్రచార భేరి...

విశాలాంధ్ర , జీలుగుమిల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 14వ తేదీ నుండి 30వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రచార బేరీలు నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. ఆదివారం జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి గ్రామంలో సిపిఐ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అధిక ధరలు, మతోన్మాదం, దళితులపై దాడులు వంటివి కేంద్ర ప్రభుత్వం అదుపు చేయడంలో విఫలమైం దన్నారు. ఈ నెల 12న పోలవరం, చింతలపూడి, నియోజకవర్గాల సిపిఐ, సిపిఎం పార్టీలు సంయుక్త సమావేశం జంగారెడ్డిగూడెంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఈ ప్రచార బేరికి నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జీలుగుమిల్లి మండల ప్రధాన కార్యదర్శి కొప్పుల నాగరాజు, వేలేరుపాడు మండల కార్యదర్శి బాడిస రాము, ఏపీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం ధారయ్య, జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జెవి. రమణ రాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆగర్రు ఎంపీటీసీ మృతి

విశాలాంధ్ర పాలకొల్లు: ఆగర్రు ఎంపీటీసీ కొయ్యే రత్న కుమారి (40) అకాల మృతి చెందారు. అనారోగ్య కారణంతో ఆమె మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రత్నకుమారి మృతి చెందడం పట్ల పలువురు తమ సంతాపాన్ని తెలియజేశారు. ఎంపీటీసీగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఎమ్మెల్యే నిమ్మ రామానాయుడు మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, జడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

మంగపేట దుర్గ గుడికి రూ.50 వేలు విరాళం

విశాలాంధ్ర చాట్రాయి: మంగపేట కనకదుర్గ గుడి నిర్మాణా నికి రూ.50వేలు విరాళాన్ని ఇచ్చి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ నాయకులు గంగాధర్ తన భక్తి భావాన్ని చాటుకున్నారు. బలహీన వర్గాలకు నిలయమైన చీపురుగూడెం పంచాయతీ శివారు మంగపేటలో నూతనంగా నిర్మాణం చేపట్టిన కనకదుర్గ ఆలయాని విరాళం అందజేయడం పట్ల పలువురు హర్షం ప్రకటిస్తున్నారు.ఆలయ కమిటీ పెద్దలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్

విశాలాంధ్ర చాట్రాయి: నిరుపేదల జీవితాల్లో ఆర్థిక వెలుగులు నింపిన ఘనత జగన్మోహన్ రెడ్డిదేనని చాట్రాయి ఎంపీపీ లంకొ నిర్మలా కొని ఆడారు. ఆదివారం చాట్రాయి మండలం బూరుగూడెం గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయం కన్వీనర్ లు గృహసారధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - ముదినేపల్లి : పేదలకు కార్పోరేట్ ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పెదపాలపర్రు గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి తల్లిదండ్రులు మల్లేశ్వరరావు (మైనర్ బాబు) దంపతుల జ్ఞాపకార్థం విజయవాడ మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శోభనాద్రి చౌదరి తల్లిదండ్రుల పేర మెగా వైద్య శిబిరం నిర్వహించి కంటి , నరముల , దంత , ఎముకలు , గైనకాలజీ , కార్డియాలజీ పలు రోగాలకు సంబంధించిన వైద్య నిపుణులచే పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో. వెనిగండ్ల రాము , కోడూరు శేషుబాబు , బొర్రా చలమయ్య , చలసాని జగన్ మోహన్ రావు , బొమ్మనబోయిన విజయలక్ష్మి , గంటా రాజేష్ , దావు నాగరాజు , బొంగు రవికుమార్ , తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

విశాలాంధ్ర - కలిదిండి: వరి పండించే రైతులు సేంద్రియ వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని కిసాన్ మోర్చా ఏలూరు జిల్లా అధ్యక్షులు కీర్తి వెంకట్ రామ్ ప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని కోరుకొల్లు గ్రామంలో ప్రకృతి సేద్యం చేస్తున్నటువంటి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అభివృద్ధి కోసం భారత ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న కృషి గురించి వివరించారు. కిసాన్ సన్మాన్ విధి యోజన, కిసాన్ రైలు, పసల్ బీమా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డ్, రైతు భరోసా కేంద్రాలు, రైతు బ్యాంకుల గురించి వివరించారు. సాఫ్ట్ వేర్ రంగంలో వివిధ దేశాలలో పనిచేసి మాతృభూమికి సేవ చేయాలని తలంపుతో భారతదేశానికి వచ్చిన పుప్పాల.సాయి అనే రైతు 50 ఎకరాల కౌలుకు తీసుకుని సేంద్రియ వ్యవసాయం చేస్తూ ప్రజలకు మంచి ఆరోగ్యకరమైన ఆహారం పండిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థానం అనుమతితో ప్రత్యేకంగా స్వామివారికి సేంద్రియ ఆహార ధాన్యాలను తనవంతుగా అందిస్తున్నారని అన్నారు. సేంద్రియ ఆహార ఉత్పత్తులు కావాలనుకునేవారు స్వయంగా వచ్చి సాయిని సంప్రదించి తీసుకువెళ్లాలని సూచించారు. అనంతరం సాయికి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జడ్డు. వీర వెంకట సత్యనారాయణ ఓబిసి మోర్చా జిల్లా కార్యదర్శి బో. శ్యామల రాజు గౌడ్, పెటేటి. వెంకటరత్నం, సాగి. సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర -ముదినేపల్లి : అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన కుటుంబానికి రూ.7 వేలు ఆర్థిక సహాయంతో పాటు గ్యాస్ స్టవ్ , నిత్యవసర సరుకులు అందజేశారు. మండలంలోని గురజ గ్రామానికి చెందిన వంగ రఘు బాబు ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమై కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారు. ఈ సమాచారం తెలుసుకున్న అమరావతి మాజీ అంబాసిడర్ వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్ రూ. 5వేలు , నిత్యవసర సరుకులు , బియ్యం అందజేయగా, షేక్ జిలాని రూ 2 వేలు , గ్యాస్ స్టవ్ బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ బాధిత కుటుంబాన్ని దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని మనోజ్ కోరారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ పండుగ

విశాలాంధ్ర, జంగారెడ్డిగూడెం: సర్వ లోక మనుష్యుల రక్షణార్థం ఏసుక్రీస్తు తన ప్రాణాలను సైతం అర్పించి ,చనిపోయి మూడవ రోజు తిరిగి లేచిన రోజును ఈస్టర్ పండుగగా క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారని చింతలపూడి ఎమ్మెల్యే వి.ఆర్ ఎలిజా అన్నారు. ఈస్టర్ పర్వదినం సందర్భంగా మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో ఆర్ సి ఎం చర్చ్ నందు ఈస్టర్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు.చింతలపూడి శాసనసభ్యులు ఉన్నమట్ల ఎలిజా కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈస్టర్ కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులందరికీ ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పోల్నాటి బాబ్జి,మండల పార్టీ అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు,మండల సచివాలయుల కన్వీనర్ గురజాల పార్థసారధి, అక్కంపేట సర్పంచ్ నాగేంద్ర , పంగిడి గూడెం సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు, మండల యువ నాయకులు గంజి వినోద్ , ఆర్. సి.ఎం సంఘ పెద్దలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - లింగపాలెం : క్రీస్తు శిలువలో మృతి చెంది పునరుద్దారుడై మూడవ రోజున సజీవంగా సమాధి నుంచి లేచిన రక్షకుడైన క్రీస్తును మానవాళంతా విశ్వాసంతో ఆరాధించాలని మత గురువులు బోధించారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకుని లింగపాలెం మండలంలోని గ్రామాలలో ఉన్న చర్చిలలో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తు బోధనలను వినిపించారు. ప్రత్యేక క్రైస్తవ గీతాలతో విశ్వాసులు అలరించారు. క్రీస్తును ఆదర్శంగా తీసుకోవాలని మత గురువులు కోరారు. ప్రార్ధనలు అనంతరం గ్రామాలోని అన్ని చర్చిలలో విశ్వాసులంతా కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు...

విశాలాంధ్ర - నూజివీడు టౌన్: క్రిస్మస్ తరువాత క్రైస్తవులు జరుపుకునే అతిపెద్ద పండుగ ఈస్టర్, ఈ పండుగను క్రైస్తవ సోదరులు ఆదివారం తెల్లవారుజామున, మధ్యాహ్నం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నూజివీడు పట్టణంలో ఆర్.సి.యం టౌన్ చర్చ్, సీఎస్ఐ టౌన్ చర్చ్ ల తో పాటు అన్ని ప్రధాన చర్చ్ ల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నూజివీడు రూరల్ మండలం పరిధిలో అన్ని గ్రామాల్లో నీ క్రైస్తవ దేవాలయాల్లో క్రైస్తవులు పండుగ జరుపుకొని స్వీట్లు పంచుకున్నారు.

విద్యుత్తు వైర్లు తగిలి తాపీకూలీ మృతి

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఏలూరు జిల్లా ఉంగుటూరు వైయస్సార్ జగనన్న కాలనీలో ఆర్చి నిర్మాణంలో విద్యుత్ వైర్లు తగిలి యువకుడు ఆదివారం మృతి చెందాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జగనన్న ఇళ్ల కాలనీలో ఉంగుటూరు గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ (20) ఆర్చి పనులు చేస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు కుటుంబ సభ్యులు బంధువులు సంఘటన ప్రదేశానికి వచ్చి మహమ్మద్ మృత దేహాన్ని చూసి చల్లించి పోయారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు గుత్తేదారులతో చర్చించడం జరిగింది. గుత్తేదారుడు తరుపున ఓ ప్రజా ప్రతినిధి బాధిత కుటుంబ సభ్యులతో చర్చించి నష్ట పరిహారం ఇస్తానని చెప్పడంతో కుటుంబ సభ్యులు శాంతించారు. మృతదేహం వద్ద తల్లిదండ్రులు షేక్ మీరా సాయిబ్, బోరున విలపించారు. మాకు పిల్లలు లేకపోయినా నిన్ను గారాబంగా పెంచుకున్నామని తండ్రి మీరా సాయిబ్ కంటతడి పెట్టుకున్నారు. తాపీ పని చేసి మహమ్మద్ కుటుంబాన్ని పోషిస్తున్నారు. విషయం తెలుసుకున్న వెంటనే ఉంగుటూరు ఎంపీటీసీ సభ్యుడు డాక్టర్ పెనుగొండ బాలకృష్ణ సంఘటన ప్రదేశానికి వచ్చి బాధిత కుటుంబాలను పరామర్శించారు.విద్యుత్ షాక్ కు గురై మృతి చెందిన తాపీ కూలీ మహమ్మద్ విషయంలో విద్యుత్ శాఖకుఎటువంటి సంబంధం లేదని నారాయణపురం విద్యుత్తు జేఈఈ ఏ శ్రీరాములు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఆర్చి పనులు చేసినప్పుడు మా దృష్టికి తీసుకువస్తే విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నామని, గతంలో చాలా సార్లు నిలుపుదల చేసామని విద్యుత్ ఏఈ అన్నారు. సంఘటన ప్రదేశానికి ఆయన వచ్చి పరిశీలించారు.